క్లుప్తంగా

శుభకార్యం

అమడగూరు: మండలంలోని ఆకులవారిపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి కుమారుడి వివాహం ఆదివారం బాగేపల్లిలో జరిగింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం స్థానిక నాయకులతో చర్చించారు.

ఓడీ చెరువు: కొండమకర్లకు చెందిన వైఎస్సార్‌ సీపీ మైనారిటీ నాయకుడు నయీమ్‌ అలి యాస్‌ బట్టూ కుమార్తె వివాహం ఆదివారం కొండకమర్లలో జరిగింది. వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

చౌడేశ్వరీ దేవి ఆలయంలో పూజలు



పూజలందుకుంటున్న చౌడేశ్వరీ దేవి

తాడిమర్రి: మండలంలో పెద్దకోట్ల గ్రామంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మ వారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అలంకరించారు. అనంతరం పూజలు చేసి, భక్తులకు ప్రసాదం అందజేశారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు చౌడేశ్వరిదేవికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పోలింగ్‌ కేంద్రాల పరిశీలన



బాలుర ఉన్నత పాఠశాలలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఆర్డీఓ రాఘవేంద్ర

కదిరి అర్బన్‌: స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ కేంద్రాలను ఆదివారం ఆర్డీఓ రాఘవేంద్ర, తహసీల్దార్‌ నటరాజ్‌, ఆర్‌ఐ మున్వర్‌ పరిశీలించారు. పోలింగ్‌ కేంద్రాల్లో తాగునీటి వసతి, విద్యుత్‌ సౌకర్యం, ఫ్యాన్లు తదితర ఏర్పాట్లపై ఆరా తీశారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో మొత్తం 6 పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో జెడ్పీ గర్ల్స్‌ హైస్కూల్‌లో రెండు పట్టభద్రులు, ఒకటి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌ కేంద్రం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 3 పట్టభద్రుల పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్‌ కేంద్రాల్లో గ్యాడ్యుయేట్లు మొత్తం 4,216 మంది, ఉపాధ్యాయులు 516 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

- ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సిద్దారెడ్డి
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



పుట్టపర్తి: పార్టీ కార్యాలయంలో కేక్‌ కట్‌ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



కదిరి అర్బన్‌: వైఎస్సార్‌ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ బలోపేతానిరి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఆదివారం పుట్టపర్తి పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 13 సంవత్సరాలుగా పార్టీకి వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా ఉన్నారని తెలిపారు. ఇదే పట్టుదలతో వచ్చే ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుడా చైర్‌పర్సన్‌ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్‌ చైర్మన్‌ తుంగా ఓబుళపతి, వైస్‌ చైర్మన్‌ తిప్పన్న, రాష్ట్ర నెట్‌ క్యాప్‌ డైరెక్టర్‌ మాధవరెడ్డి, టౌన్‌ కన్వీనర్‌ రంగారెడ్డి, మాజీ కన్వీనర్‌ గంగాద్రి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్‌ ఆవుటాల రమణారెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, భాస్కర్‌రెడ్డి, సూర్యాగౌడ్‌, మాజీ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడే వారికి గుర్తింపు..

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీలో కష్టపడే ప్రతి నాయకుడు, కార్యకర్తకు గుర్తింపు ఇచ్చి పదవులిస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. జిల్లా గ్రీవెన్సు సెల్‌ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన నల్లమాడ మండలం గోపేపల్లికి చెందిన ముక్తాపురం జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం పుట్టపర్తిలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. తన సేవలను గుర్తించి జిల్లా స్థాయి పదవి ఇచ్చినందుకు సీఎం జగన్‌, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

హామీలన్నీ నెరవేర్చారు..

కదిరి అర్బన్‌: యావత్‌ భారతదేశం ఆంధ్రప్రదేశ్‌ వైపు చేసే విధంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మెల్యే నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. మహానేత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిని రాష్ట్రంలో పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. రాబోవు రోజుల్లో 30 ఏళ్లు పార్టీ అధికారంలో ఉండేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వివిధ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, వైస్‌ చైర్మలు, డైరెక్టర్‌ పదవులను పార్టీకి కష్టపడే వారికి ఇచ్చారని తెలిపారు.

కుమ్మరవాండ్లపల్లిలో..

కదిరి అర్బన్‌: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్‌ నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ కట్‌ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు బాహావుద్దీన్‌ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారని పేర్కొన్నారు. ప్రతి నిరుపేద గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. నిరుపేదలకు కార్పొరేట్‌ తరహాలో వైద్యం, విద్య అందిస్తున్నారని చెప్పారు.



కుమ్మరవాండ్లపల్లిలో కేక్‌ కట్‌ చేసి సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

పరామర్శ



చెన్నకేశవరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: మండలంలోని రాఘవంపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న యర్రభూమి చెన్నకేశవరెడ్డిని ఆదివారం ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. గత నెల 10వ తేదీన చెన్నకేశవరెడ్డి కుమారుడు పవన్‌ కుమార్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అధైర్యపడవద్దని ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అదేవిధంగా గ్రామంలోని యర్రభూమి శివారెడ్డి స్వగృహంలో జరిగిన శుభకార్యంలో పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ధర్మవరం: మండలంలోని మోటుమర్ల గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ఎన్‌కేసీ సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ కమిషనర్‌ మల్లికార్జున మాట్లాడుతూ.. విద్యార్థులంతా పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌కేసీ సేవా సమితి అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి కమల్‌నాథ్‌ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఓడీ చెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్‌ శ్రీధర్‌ తెలిపారు. మండలంలో 1,025 మంది పట్టభద్రులు, 50 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు.

ధర్మవరం: పట్టణంలో సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీఓ తిప్పేనాయక్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరంలో ఎనిమిది పోలింగ్‌ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగు కేంద్రాలు, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్‌ కేంద్రాలు, నెహ్రూ నగర్‌ మున్సిపల్‌ పాఠశాలల్లో రెండు పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలోని తాడిమర్రిలో జడ్పీ హైస్కూల్‌, ముదిగుబ్బలో జెడ్పీ హైస్కూల్‌, బత్తలపల్లిలో జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

కొత్తచెరువు: కొత్తచెరువులోని స్థానిక బాలికల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 1,715 పట్టభద్రులు, 120 ఉపాధ్యాయుల ఓట్లు ఉన్నాయి. మూడు పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నల్లమాడ: ఎమ్మెల్సీ ఎన్నికల కోసం స్థానిక జిల్లా పరిషత్‌ పాఠశాలలో రెండు పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్‌ దేవేంద్రనాయక్‌ తెలిపారు. 956 మంది పట్టభద్రులు, 81 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు 2 పోలింగ్‌ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులు 32, పట్టభద్రులు 742 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

బత్తలపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్‌ యుగేశ్వరి దేవి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్‌ కేంద్రాలను డిప్యూటీ తహసీల్దార్‌ హరిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. మండల వ్యాప్తంగా 1,150 మంది పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

భక్తులతో పోటెత్తిన ఖాద్రీ



ఆలయంలో శ్రీవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం సోమవారం జరగనుంది. బ్రహ్మరథంపై కొలువుదీరే శ్రీవారిని దర్శించుకునేందుకు ఆదివారమే సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా కదిరికి చేరుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంతో పాటు పుర వీధులన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆలయంలో నారసింహుడి దర్శనం కోసం భక్తులు బారులుదీరారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇంకా పలుచోట్ల నాటకాలు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి స్వామి తిరువీధుల్లో ఐరావతంపై దర్శనమిచ్చారు. – కదిరి:



భక్తుల కాలక్షేపం కోసం హరికథ



రథ కలశం మోసుకెళుతున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రత్యామ్నాయ మార్గాల్లో రావాలి

కదిరి అర్బన్‌: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా సోమవారం హిందూపురం రోడ్డు వైపు నుంచి వచ్చే ఓటర్లు ప్రత్యామ్నాయ మార్గాల్లో పోలింగ్‌ కేంద్రాల్లో రావాలని తహసీల్దార్‌ నటరాజ్‌ ఆదివారం పేర్కొన్నారు. ముత్యాలచెరువు, కేఎస్‌పాళెం, కే.బ్రాహ్మణపల్లి, ఎగువపల్లి ఓటర్లు హిందూపురం రోడ్డు గుండా మూర్తిపల్లి వద్ద శ్మశానవాటిక సమీపంలోని మారుతీనగర్‌ నుంచి రావాలని సూచించారు. బైపాస్‌ మార్గాన్ని వినియోగించుకుని కూడా రావొచ్చని పేర్కొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

బత్తలపల్లి: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఎన్ని పోరాటాలు చేస్తున్న ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టలేదని ఇక నుంచి పోరాటాలు ఉధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్‌ రజక అభివృద్ధి సంస్థ కార్యదర్శి కమ్మన్న పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రజకుల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కమ్మన్న, సత్యసాయి జిల్లా రజక అభివృద్ధి సంస్థ వైస్‌ చైర్మన్‌ నారాయణస్వామి మాట్లాడారు. పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. 150 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్‌ ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. బత్తలపల్లిలో రజకులు దుస్తులు ఉతకడానికి ధోబీ ఘాట్లు నిర్మించాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు.

మండల కన్వీనర్‌గా శివప్రసాద్‌ ఎన్నిక

రజకుల సంఘం మండల కన్వీనర్‌గా ఆర్‌ఎం శివప్రసాద్‌, కమిటీ అధ్యక్షుడిగా ఎం.సాయినాథ్‌, ప్రధాన కార్యదర్శిగా నాగభూషణ, ఉపాధ్యక్షుడిగా చిగిచెర్ల నారాయణస్వామి, కోశాధికారిగా శ్రీనివాసులు, సహాయ కోశాధికారిగా రమణ, మహిళా అధ్యక్షురాలిగా నాగేంద్రమ్మ, యువజన అధ్యక్షుడిగా తిరుపాలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



తాడిమర్రిలో పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ తిప్పేనాయక్‌



ఎన్‌పీకుంట: మాట్లాడుతున్న రూరల్‌ సీఐ శంకర్‌నాయక్‌

ఎన్‌పీకుంట: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కదిరి రూరల్‌ సీఐ శంకర్‌నాయక్‌ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత పోలింగ్‌ అధికారులకు తెలియజేయాలన్నారు. రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం చేయరాదన్నారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘించినా, అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సద్గురుడు, జమేదార్‌ సుబ్రహ్మణ్యం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తాడిమర్రి: స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 144 సెక్షన్‌ అమల్లో ఉంటుందన్నారు. ఇద్దరు, ముగ్గురు కలసి గుంపులు, గుంపులుగా ఒక చోట ఉండకూడదని హెచ్చరించారు. ఓటుహక్కు లేని వారు పోలింగ్‌ కేంద్రం, ఆ పరిసరాల్లోకి రాకూడదని తెలిపారు. సాయంత్రం 6 గంటల వరకూ మద్యం షాపులు మూసి వేస్తున్నట్లు వివరించారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

అమడగూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునే వారు తప్పనిసరిగా ఏదేని గుర్తింపు కార్డును తీసుకురావాలని డిప్యూటీ తహసీల్దార్‌ రెడ్డిశేఖర్‌ పేర్కొన్నారు. పోలింగ్‌ గదిలో ఓటును వేసే సమయంలో ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్‌ లైసెన్స్‌, పాస్‌పోర్ట్‌, ఉద్యోగులకు పనిచేసే సంస్థ జారీ చేసిన సర్టిఫికెట్‌ కానీ ఏ ఇతర గుర్తింపు కార్డు పోలింగ్‌ నిర్వహణ అధికారులకు చూపాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ మాత్రమే పోలింగ్‌ జరుగుతుందన్నారు. ఎస్‌ఐ వెంకటనారాయణ మాట్లాడుతూ పోలింగ్‌ ఆవరణలో 144 సెక్షన్‌ అమల్లో ఉంటుందన్నారు. ఎవరైనా అనవసరంగా గొడవలకు పాల్పడినా, కక్ష ప్రేరేపిత వ్యాఖ్యలు చేసినా నాన్‌ బెయిలబుల్‌ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తాడిమర్రి: స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని ఆర్డీఓ తిప్పేనాయక్‌ తహసీల్దార్‌ నాగరాజును ఆదేశించారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ బూత్‌లను పరిశీలించారు. పట్టభద్రుల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్‌ బూత్‌ నంబర్‌ 170, ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేసిన 85 నంబర్‌ పోలింగ్‌ బూత్‌లలో సౌకర్యాలపై ఆరా తీశారు. ఉదయం 8 గంటలకు కచ్చితంగా ఓటు వేయడం ప్రారంభించాలన్నారు. అవకతవకలకు తావులేకుండా ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సాయంత్రం 4 గంటలకు క్యూలో ఉన్న ఓటర్లు ఓటు వేయడానికి అనుమతించాలని తెలిపారు. ఇక్కడ వసతులు, అవకతవకలపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు చరణ్‌, చైతన్య, రాముడు, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత షుగర్‌ నిర్ధారణ పరీక్షలు

ధర్మవరం అర్బన్‌: పట్టణంలోని స్పందన ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కళాజ్యోతి సర్కిల్‌లో నిర్వహించిన ఉచిత షుగర్‌ నిర్ధారణ పరీక్షలకు మంచి స్పందన లభించింది. 120 మందికి షుగర్‌ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు ఆసుపత్రి వైద్యులు టీఎం బషీర్‌, వై సోనియా తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది శ్రీలత, దేవకి, తేజ, దిల్‌దార్‌ తదితరులు పాల్గొన్నారు.